575) దేవగాంధారి

ప॥ కలదు తిరుమంత్రము కలదిహము బరము। కలిమి గలుగు మాకు గడమే లేదు ॥

చ॥ కమలాక్షు నీవు మాకు గలిగియుండగ భూమి। నమరలేని దొకటి నవ్వలలేదు।
నెమకి నాలుకమీద నీనామము మెలగగ। తమితో బరుల వేడ దా జోటులేదు ॥

చ॥ శౌరి నీ చక్రము నాభుజము మీదనుండగాను। బూరవపు బగ లేదు యెదురూ లేదు।
చేరువ నీసేవ నాచేతులపై నుండగాను। తీరని కర్మపు వెట్టిదినమూ లేదు ॥

చ॥ అచ్చుత నీపై భక్తియాతుమలో నుండగాను। రచ్చల బుట్టిన యపరాధమూ లేదు।
నిచ్చలు శ్రీవేంకటేశ నీశరణాగతుండగా। విచ్చిన విడే కాని విచారమే లేదు ॥